శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్ కుమార్
- నూతన క్రిమినల్ చట్టాలపై శిక్షణ ప్రారంభం

మాట్లాడుతున్న ఎస్పీ

ఆసిఫాబాద్ టౌన్, మే 27 : క్రమశిక్షణతో ఉంటూ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ శ్రీ సురేశ్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నూతన క్రిమినల్ చట్టాలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నేర, న్యాయ వ్యవస్థను పూర్తిగా మార్చేందుకు తీసుకోనున్న చర్యల్లో భాగంగా కొత్తగా రూపొందించిన మూడు చట్టాలు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం చట్టాలు రానున్న జూలై 1, 2024 నుంచి అమలులోకి రానున్నాయి. అందువలన జిల్లాలోని పోలీసు సిబ్బంది అందరూ కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్న సంకల్పంతో ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చట్టాల వర్తింపు, నేరాలు, దానికి సంబంధించిన కేసులతో వ్యవహరిస్తున్నప్పుడు వాటిని ఎలా గ్రహించాలనే దానిపై పోలీసు శాఖకు చెందిన డీఎస్పీ నుంచి కానిస్టేబుల్‌తో పాటు సంబంధిత అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇప్పటికే డీసీ ఆర్బీ సిఐ రమేశ్, ఎస్‌బీ ఎస్ఐ రామకృష్ణ, ఏఎస్ఐ జమీల్ పాష, తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పొంది జిల్లాలో శిక్షణ ఇవ్వనున్నారని పేర్కొన్నారు. క్రమశిక్షణతో శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి చేసుకొని చట్టాల పైన పూర్తి అవగాహన తెచ్చుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఈ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లాలోని నలుగురు సీఐలు, ఆరుగురు ఎస్ఐలు, 10 మంది ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, పది మంది పోలీస్ కానిస్టేబుల్ కలిపి మొత్తం 40 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. విడుతల వారీగా జిల్లాలోని మొత్తం సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

మాట్లాడుతున్న కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, హాజరైన అధికారులు

ఆసిఫాబాద్ టౌన్, మే 27 : అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి, మరమ్మతు పనులు వేగవంతం చేసి పాఠశాలలు పున: ప్రారంభమయ్యేలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మండల విద్యాశాఖ అధికారులు, మండల నోడల్ అధికారులతో పాఠశాలల అభివృద్ధి పనులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో మౌలిక సదుపాయాలైన తాగునీరు, విద్యుదీకరణ, మూత్రశాలలు, ఇతర మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతి రోజూ మండల విద్యాధికారులు, మండల నోడల్ అధికారులు ప్రతి పాఠశాలను సందర్శించి పనుల పురోగతిపై పర్యవేక్షించాలని, పనుల వద్ద ఫొటోలు దిగి పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. వచ్చే 15 రోజులు యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారులు గ్రామ సమాఖ్య సంఘ సభ్యులు సమన్వయంతో ఇంకా పనులు ప్రారంభం కానీ పాఠశాలలలో వెంటనే పనులు ప్రారంభించాలని, రూపొందించిన ప్రణాళికా ప్రకారంగా పనులు చేపట్టి 100 శాతం పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, మండల విద్యాధికారులు, నోడల్ అధికారులు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి..

ఓట్ల లెక్కింపులో భాగంగా విధులు నిర్వహించే సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియను పారదర్శంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో మాట్లాడారు. ఓట్ల లెక్కింపునకు సరిపడా సిబ్బంది కేటాయింపు మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించి, ఎన్ ఐసీ ర్యాండమైజేషన్ సాఫ్ట్‌వేర్ ద్వారా కేటాయించామని పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ మధుకర్, ఎన్ఐసీ ఇన్‌చార్జి శ్రీకాంత్ పాల్గొన్నారు.

కోలిండియా క్రీడాపోటీల విజేతలకు బహుమతులు

శ్రీరాంపూర్, మే 27: కోలిండియా, పబ్లిక్ సెక్టార్ జాతీయస్థాయిలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో శ్రీరాంపూర్ ఏరియా నుంచి 9 మంది క్రీడాకారులు బహుమతులు సాధించారు. ఎం విజయ్ (వెయిట్ లిఫ్టింగ్), లక్ష్మణ్ (బాడీ బిల్డింగ్), తోట సురేశ్, ఎద్దు సదయ్య, జీ నరేందర్, బీ తిరుపతి, జీ శ్రీకాంత్, బీ రాజ్‌కుమార్ (హాకీ), ఆర్ సృజన్‌రావు (క్యారం) పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో విజయం సాధించారు. కాగా, సోమవారం జీఎం కార్యాలయంలో వీరిని జీఎం సంజీవరెడ్డి, డీవైజీఎం అరవిందరావు శాలువాలతో సన్మానించి నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి, ఏజీఎం మురళీధర్, ఏఐటీయూసీ బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొమురయ్య, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, స్పోర్ట్స్ సెక్రటరీ పాల్ సృజన్, సూపర్‌వైజర్ చాట్ల అశోక్, కోఆర్డినేటనర్ తోట సురేశ్, పిట్ కార్యదర్శి రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్‌లో అర్ధరాత్రి తనిఖీలు

జైనూర్, మే 27 : జైనూర్‌లో ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య ఆధ్వర్యంలో ఆదివారం అర్ధరాత్రి ఆపరేషన్ చబుత్ర చేపట్టారు. సీఐ అంజయ్య 30 మంది యువకులను అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అర్ధరాత్రి దాటిన తర్వాత ఎవరు కూడా అకారణంగా రోడ్లపైన తిరగవద్దన్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉందని ఏదైనా మెడికల్ ఎమర్జెన్సీలో తప్ప మిగతా సందర్భాల్లో యువకులు రోడ్లపైకి వచ్చి రోమింగ్ చేయవద్దని కోరారు. చాలామంది యువకులు నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలను వేగంగా నడపడం, అదే విధంగా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న వారిని అడ్డుకట్ట వేయడానికి ఆపరేషన్ చబుత్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఆపరేషన్ లో జైనూర్, సిర్పూర్(యూ) ఎస్ఐ సందీప్ కుమార్ మాధవ్ ఉన్నారు.

భారీ చోరీ

- నస్పూర్‌లో రూ.4.50 లక్షలు, 15 తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి అపహరణ

బాధితులతో మాట్లాడుతున్న సీసీసీ ఎస్ఐ రవికుమార్

సీసీసీ నస్పూర్, మే 27: మంచిర్యాల జిల్లా నస్పూర్ మున్సిపల్ పరిధిలోని నాగార్జున కాలనీలో సోమవారం సాయంత్రం భారీ చోరీ జరిగింది. శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ ఆర్‌పీ-1గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్న గుమ్మడి సత్తయ్య, భార్య శశిరేఖ, మనుమరాలు సాయివర్షిణితో కలిసి నస్పూర్ నాగార్జునకాలనీలోని 3016 క్వార్టర్‌లో నివాసముంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం సత్తయ్య రెండో షిఫ్ట్ విధులకు వెళ్లాడు. సాయంత్రం 5.30గంటల సమయంలో భార్య శశిరేఖ సమీపంలోని సింగరేణి ప్రాణహిత స్టేడియంలో వాకింగ్‌కు వెళ్లింది. ఇంట్లో ఉన్న మనుమరాలు సాయివర్షిణి ఇంటికి వెళ్లింది. శశిరేఖ ఇంటికి వచ్చింది. వెనుకాల డోర్ తీసి ఉండడాన్ని గమనించిన శశిరేఖ, బెడ్‌రూంలోకి వెళ్లి చూసే సరికి బీరువా తెరిచి ఉంది. అందులోని నగదు, నగలు చోరీకి గురి కావడంతో పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ఆకుల అశోక్, ఎస్ఐ రవికుమార్, ఎస్ఐ-2 జితేందర్‌సింగ్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. బెల్లంపల్లి నుంచి డాగ్‌స్క్వాడ్, ఫింగర్‌ప్రింట్ సిబ్బంది, క్లూస్ టీంను రంగంలోకి దింపారు. రూ.4.50లక్షలు, 15 తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి చోరీకి గురైనట్లు శశిరేఖ తెలిపింది. గతేడాది మార్చిలో కూడా వీరి ఇంట్లో దొంగలు చోరీకి విఫలయత్నం చేసినట్లు తెలిసింది.

లోక్ అదాలత్‌లో కేసులు

పరిష్కారమయ్యేలా చూడాలి

కుమ్రం భీం ఆసిఫాబాద్ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి యువరాజ్

మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి యువరాజ్

ఆసిఫాబాద్ టౌన్, మే 27 : జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే యువరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని న్యాయస్థాన భవన సముదాయంలో సోమవారం పోలీసుశాఖ అధికారులతో జూన్ 8వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో పనిచేసి కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. రాజీకీ వచ్చేలా చేయడం ద్వారా కక్షిదారులు సమయం, డబ్బు ఆదా చేసుకోవచ్చని తెలియజేయాలని సూచించారు. సంబంధిత స్టేషన్ల వారీగా కేసులపై ప్రత్యేక దృష్టిపెట్టాలని తెలిపారు. సైబర్ క్రైమ్ కేసులు రాజీ చేయడంతో పాటు అందించిన వారి సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా జైలును సందర్శించి, ఖైదీలతో మాట్లాడారు. లీగల్ సర్వీసెస్ గురించి అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్, జైనూర్ సీఐలు సతీశ్, కే అంజయ్య, ఎస్ఐలు చంద్రశేఖర్, ప్రవీణ్, విజయ్, లీగల్ కౌన్సిల్ అంజనీ దేవి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పనుల పరిశీలన

దండేపల్లి, మే 27 : దండేపల్లి మండలం కాంప్లెక్స్ పరిధిలోని 8 ప్రాథమిక పాఠశాలలు, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను సోమవారం హెచ్ఎం బీసగోని శంకర్‌గౌడ్ పరిశీలించారు. త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. పిల్లల ఏకరూప దుస్తుల కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట సీఆర్పీ గరిగె నర్సయ్య, సంఘర్ష్ రాజేశ్వర్ రావు తదితరులున్నారు.

కౌంటింగ్‌కు బందోబస్తు ఏర్పాటుచేయాలి

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్

ఆసిఫాబాద్ టౌన్, మే 27 : జూన్ 4న నిర్వహించే లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌కు భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ అన్నారు. న్యూ ఢిల్లీ నుంచి ఇతర సంయుక్త కమిషనర్లతో కలిసి కౌంటింగ్ ఏర్పాట్లపై అన్ని రాష్ట్రాల ఎన్నికల అధికారులు, అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇప్పటివరకు 6 విడుతల ఎన్నికలు పూర్తయ్యాయని, చివరి విడుత ఎన్నికలు జూన్ 1న జరుగనున్నాయన్నారు. కౌంటింగ్ ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. వీసీలో కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే మాట్లాడారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల కౌంటింగ్ ఆదిలాబాద్ ఉంటుందని చెప్పారు. అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. కౌంటింగ్ సిబ్బందికి రెండు విడుతల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ఆసిఫాబాద్ టౌన్, మే 27 : మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని షీ టీం ఇన్‌చార్జి సునీత సూచించారు. చిర్రకుంట ఆటో స్టాండ్‌లో సోమవారం మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థినులు, మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్‌లకు పాల్పడితే వెంటనే షీ టీంను సంప్రదించాలని సూచించారు. అత్యవసర సమయంలో డ యల్ 100కు, షీ టీం ఆసిఫాబాద్ 87126 70564 నంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు. సభ్యులు, శ్రీలత, స్వప్న ఉన్నారు.

అవగాహన కల్పిస్తున్న షీ టీం ఇన్‌చార్జి సునీత